క్లుప్తంగా

బాల్యవివాహాలు నేరం



మాట్లాడుతున్న ప్రసాదరావు

రాజాం సిటీ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని బెజ్జిపురం యూత్‌క్లబ్ ఎన్‌జీఓ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 'బాలలకు అందుబాటులో న్యాయం' అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలకార్మిక నిర్మూలనా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు భీమేశ్వరరావు, రామ్‌కుమార్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

బాడంగి: ఆయిల్ పామ్ సాగుకు ఉద్యావన శాఖ ద్వారా రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లాఉద్యానవనశాఖ అధికారి సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయిల్ పామ్ మెగాప్లాంటేషన్‌లో భాగంగా వాడాడలో ఆరుగురు రైతులకు చెందిన 8 హెక్టార్లలో మంగళవారం 1700 మొక్కలు నాటించారు. ఉద్యానవన సహాయకులు జి.విజయకుమార్, శివ,లక్ష్మీబాలాజీ, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన

రాజాం: మండలంలోని కంచరాం, గురవాం గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటి నుంచి చేపడుతున్న చెత్తసేకరణను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.చెత్తను ఆరుబయట, కాలువల్లో పారబోయవద్దని సూచించారు. తడి, పొడిచెత్తను వేర్వేరుగా బకెట్లలో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందించాలని చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎస్‌ఓ జి.మురళీనాథ్ మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశమ య్యారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పీ–4 సర్వే, ఇళ్ల నిర్మాణాలు, రేషన్ ,పెన్షన్ పంపిణీపై చర్చించారు. ఎంపీడీఓ పి.రవికుమార్, హౌసింగ్ ఏఈ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

రాజాం: గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ ప్రాజెక్టు లీడర్ కె.ప్రకాశరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని రైతు సేవా కేంద్రాల వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం రెండోరోజు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాల తయారీ, నవధాన్యాల సాగు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తదితర అంశాలను వివరించారు. రాజాం వ్యవసాయశాఖ ఏడీఏ చంద్రరావు, ఏఓ రఘునాథ్, పలు మండలాల ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న జీసీ క్లబ్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక జీసీ క్లబ్‌లో పనిచేసి అనారోగ్యానికి గురైన వై.పెంటయ్యకు క్లబ్ సభ్యులు రూ. 50వేల ఆర్థికసాయం చేశారు. బాధితుడికి క్లబ్ అధ్యక్షుడు చెలికాని బదరీబాబు, సభ్యులు కలిసి మంగళవారం నగదు అందజేశారు. ఈసందర్భంగా బదరీబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు క్లబ్ తరఫున తమ వంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. క్లబ్ ఉపాధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి గురవాన నారాయణరావు, సభ్యులు పొట్నా సత్యనారాయణగుప్త, సోమశేఖర్, పాలవలస శ్యామసుందర్, బుజ్జి, మజ్జి మదన్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



దాతలు అందజేసిన నోట్ పుస్తకాలను చూపిస్తున్న బాడంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

బాడంగి: హైదరాబాద్‌కు చెందిన హెల్పింగ్ సొసైటీ, స్థానిక దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా మండలంలోని పలుప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక ఆదర్శప్రాథమిక పాఠశాల, వీరసాగరం, పింద్రంగి వలస తదితర పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశామని దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ శాంతి తెలిపారు. ఎంఈఓ.లక్ష్మణదొర, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ డి.శ్రీనివాసరావు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తగ్గిపోయిన చిరుధాన్యాల సాగు..!

- గతంలో కంటే భారీగా తగ్గిన చిరుధాన్యాలు, అపరాల సాగు విస్తీర్ణం
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఖరీఫ్ అంతా వరి, మొక్కజొన్న పంటలే..



అప్పల అగ్రహారం సమీపంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

రాజాం నియోజకవర్గంలో అపరాలు, చిరుధాన్యాల సాగు వివరాలు

పంట	సాగు(ఎకరాల్లో)
జొన్నలు	04
రాగులు	12
నువ్వులు	02
కందులు	16
ఉలవలు	09
మినుములు	230
పెసర	16

రాజాం: అసలు పంటలు ఆదుకోకున్నా కొసరు పంటలు ఆదుకుంటాయన్నది పెద్దల సామెత. రాజాం నియోజకవర్గంలో ఇదివరకు ఏటా ఖరీఫ్‌లో రైతులు వరి, మొక్కజొన్నతో పాటు చిరుధాన్యాలు, అపరాల పంటలు సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది చిరుధాన్యాలు, అపరాల సాగు ఎక్కడా పెద్దగా కనిపించడం లేదు. చిరుధాన్యాలు, అపరాల సాగుతో రైతులకు మంచి ఆదాయమే వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరుధాన్యాలు, అపరాల విత్తనాల పంపిణీ నిలిచిపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో ఈ పంటల సాగు తగ్గిపోయింది. కందులు, పెసలు, రాగి, నువ్వులు, వేరుశనగ, ఉలవ, మినుములు వంటి ఈ పంటలు రాజాంతో పాటు వంగర, సంతకవిటి మండలాల్లో అధికంగా కనిపించేవి. వీటి దిగుబడి బాగా ఉండడంతో పాటు మంచి ధర, డిమాండ్ కారణంగా రైతుకు ఆదాయం వచ్చేది. పలువురు తమ ఇళ్లలో వీటిని ఏడాది కాలంపాటు నిల్వ ఉంచుకుని వినియోగించుకునేవారు. ఈ పంటలతో ఇంట్లో పలు రకాల పిండివంటలు, పోషకాహారాలు తయారు చేసుకునేవారు. ఇప్పుడు వీటి సాగు పూర్తిగా పడిపోయింది.

దిష్టిబొమ్మల్లా రైతు సేవాకేంద్రాలు

గతంలో రైతు సేవా కేంద్రాల ద్వారా విశేష సేవలు అందేవి. అక్కడ అన్ని రకాల విత్తనాల సమాచారంతో పాటు పంటల వివరాలు అందుబాటులో ఉంచేవారు. వాటి ధరల పట్టీలు రైతులకు తెలిసేవి. విత్తనాల దగ్గర నుంచి ఎరువుల వరకు ప్రతీది రైతుకు అందేది. కియోస్కోల ద్వారా ఏ వస్తువు కావాలన్నా లభించేది. వీటి ద్వారానే రైతులకు చిరుధాన్యాలు, నవ ధాన్యాల విత్తనాలు లభించేవి.రైతులు నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని సాగు చేసేవారు. పంటను ఇంటి అవసరాలకు వినియోగించేవారు. అధికంగా సాగుచేసిన రైతులు మార్కెట్‌లో విక్రయించే వారు. మార్కెట్‌లో ఈ పంటలకు మంచి ధర ఉండేది.ప్రస్తుతం ఈ పంటల సాగు తగ్గింది. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లోకి వచ్చే ఎరువులు సైతం కూటమి కార్యకర్తలు కనుసన్నల్లోనే పంపిణీ జరుగుతోంది. రాత్రికి రాత్రే అన్నీ మాయమవుతున్నాయి. చివరకు ఏ కాలంలో, ఏ భూమిలో ఏయే పంటలు వేస్తే బాగుంటుందో చెప్పే పరిస్థితి కూడా లేదు.



రాజాం మండలం పాగిరి రైతు సేవా కేంద్రంలో మూలకు చేరిన కియోస్క్

ఖరీఫ్‌లో సాగు తగ్గింది



చిరుధాన్యాల సాగు ఖరీఫ్‌లో పడిపోయింది. కేవలం రబీలో మాత్రమే రైతులు ఎక్కువగా వీటిని సాగుచేస్తున్నారు. గతంలో వంగర, రాజాంలోని పలు ప్రాంతాల్లో వీటి సాగు అధికంగా ఉండేది. ఇప్పుడు అక్కడక్కడ వేరుశనగ, పెసర, ఉలవ వంటి పంటలు కనిపిస్తున్నాయి. రాగులు, జొన్నలు, నువ్వులు వంటి పంటల సాగు పూర్తిగా తగ్గిపోయింది. రైతులకు వీటి సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. – కె. చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం.

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న శంబంగి, తదితరులు

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మించి సంక్షేమం అందిస్తామని చంద్రబాబు అండ్ కో హామీలిచ్చారని, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా నేటికీ ఎన్నికల హామీలు కార్యరూపం దాల్చలేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయం, మోసం జరుగుతోందని అన్నారు. బొబ్బిలి పట్టణంలోని 27వ వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లిన శంబంగి కూటమి చేసిన అన్యాయాలను ప్రజలకు వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవర త్నాల పేరిట అర్హులందరికీ పథకాలు అందజేశామని, పార్టీలు, మతాలు, కులాలు చూడలేదని గుర్తు చేశారు. టీడీపీ కూటమి నాయ కులు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలకు సంబంధించిన కరపత్రాలను చూపుతూ ఈ పథకాలు మీకందాయా అని ప్రజలను శంబంగి ప్రశ్నించగా..అవేవీ అందడం లేదని ప్రజలు బదులిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్.వి. మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, వార్డు ఇన్‌చార్జ్ సుంకరపల్లి వాసంతి, వెంగళరావు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సహాయం



ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి నగదు అందజేస్తున్న పెద్దలు

బొబ్బిలిరూరల్: మండలంలోని కమ్మవలస పంచాయతీలోని ముత్తావలస గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు కోటిపల్లి అప్పారావు సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ పి రవికుమార్,సర్పంచ్ పిల్లా వసుంధర, స్థానిక పెద్దలు భాస్కరరావు, బొద్దల సత్యనారాయణ మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 10వేలు సహాయం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మల్లయ్యపేట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: రోజురోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, పలు చట్టాలపై మండలంలోని మల్లయ్యపేట గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలకు బానిసగా మారితే జీవితాలు నాశనమవుతాయని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. గ్రామంలో ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, అనవసరమైన విషయాలకు గొడవలు పడొద్దని సూచించారు.

విద్యుత్ కనెక్షన్లు ఇప్పించాలని వినతి



తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న అలజంగి గ్రామ రైతులు

బొబ్బిలిరూరల్: వ్యవసాయం కోసం వేసుకున్న బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించాలని అలజంగి గ్రామ రైతులు తహసీల్దార్ ఎం.శ్రీనును కోరారు. ఆ గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్‌ను మండల కేంద్రంలోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో రెండు కుటుంబాల వివాదాల కారణంగా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో తమ బోర్లకు విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 200 రైతు కుటుంబాలు బోర్ల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నాయని, ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో రైతులు బి.వెంకటరావు, సీహెచ్.రామారావు,గోవిందనాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు పరిష్కారం చూపడమే ధ్యేయంగా పని చేస్తున్నామని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం సచివాలయం పరిధిలోని రంగప్పవలస, ఎం.ఆర్.అగ్రహారం గ్రామాలకు చెందిన 24 మంది రైతులు తమకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదని ఇటీవల ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దార్ మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో రైతుల వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు.గ్రామ సర్పంచ్ ప్రతినిధి వెంకటరావు, వీఆర్‌ఓ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



రోడ్డును బాగుచేస్తున్న దృశ్యం

రాజాం: రాజాం–విజయనగరం ప్రధాన రహదారిలో గాయత్రికాలనీ సమీపంలో గుంతలు ఏర్పడిన రోడ్డును అధికారులు బాగుచేయిస్తున్నారు. ఈరోడ్డులో ఏర్పడిన గోతుల వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'ప్రమాదకరంగా..' అనే శీర్షికతో ఈనెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణరావు ఇక్కడిరోడ్డును పరిశీలించి, దిగువన కల్వర్టు మదుములు పాడైనట్లు గుర్తించారు. మంగళవారం వాటి స్థానంలో కొత్తవి వేసి, గోతులతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డును తాత్కాలికంగా బాగుచేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: పట్టణంలోని గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డు, వస్త్రపురికాలనీ, కంచరాం, ఆగూరు, అమరాం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో నూతనంగా జంపర్ ఏర్పాటు చేయనున్న కారణంగా విద్యుత్ అంతరాయం కలగనుందని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించి, వారిలో రక్త హీనతను తగ్గించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామని పలు పీహెచ్‌సీల వైద్యా ధికారులు తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభు త్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండల అధికారులు ,ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యదర్శులు, ఫార్మసిస్టులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం: పెనుబాక హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది



రామభద్రపురం: రామభద్రపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంపీడీఓ సన్యాసిరావు,వైద్యాధికారి దిలీప్‌కుమార్



తెర్లాం: తెర్లాం హైస్కూల్‌లో విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు, డాక్టర్ స్వాతి



మెంటాడ: కొంపంగి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైస్ ఎంపీపీ ఈశ్వరరావు



రేగిడి: బూరాడలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

కేసులు పెడితే భయపడం..!

- కదం తొక్కిన గిరిజన రైతులు
- తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన



తహసీల్దార్ కార్యాలయం ముందు నోటీసులతో నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

రామభద్రపురం: అధికారులు మాపై కేసులు పెట్టి భయపెట్టినా..మా సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చేంత వరకు తగ్గేదే లేదని కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతులు స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి గిరిజన రైతుల సాగులో ఉన్న భూములు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీఐఐసీకి విక్రయించగా ఇప్పుడు ఆ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు అభివృద్ధి పనులు ప్రారంభించారు. దీంతో తామెప్పటి నుంచో సాగు చేస్తున్న ఆ భూములను ఎలా లాక్కుంటారని గిరిజన రైతులు ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు అధికారులు కలిసి సెక్షన్ 107 చట్టం ప్రకారం ఆ గిరిజన రైతులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తూ నోటీసులు అందజేశారు. ఈ మేరకు మంగళవారం నోటీసులతో గిరిజన రైతులంతా మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన రైతులకు న్యాయం చేసేవిధంగా తహసీల్దార్ అజు రఫిజాన్ చర్యలు తీసుకుంటున్నారని ఈ నెల 12వ తేదీన మీరంతా తహసీల్దార్ కార్యాలయానికి రావాలని కాగితాలపై సంతకాలు చేయాలని నోటీసులు పట్టుకుని వచ్చిన పోలీసులు చెప్పడంతో తామంతా ఆశతో నోటీసులు అందుకుని సంతకాలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడికి వచ్చాక మాపై కేసులు పెట్టారని తెలిసిందన్నారు. ప్రజాప్రయోజనాల కోసం అభివృద్ధి చేస్తామని చెబుతూ సాగులో ఉన్న మా భూములను దౌర్జన్యంగా లాక్కుంటూ టీడీపీ కూటమి ప్రభుత్వంలో అధికారులు మాతో చెలగాట మాడుతున్నారని ఆందోళన వ్యకంచేశారు.ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ఎన్ని కేసులు పెడతారో చూస్తామని, జైలులోనైనా ఉంటాం, లేదా చావనైనా చస్తాం గాని మా భూములు వదలుకోమని తేల్చిచెప్పారు. గిరిజన రైతుల గోడు విని, సమస్యలు పరిష్కరించకుండా మమ్మల్ని అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవనం సాగేది ఎలా?

రోజూ కూలాడితే గాని కుండాడదని, రోజూ మా భూ సమస్యల కోసం పోరాటాలతో ఉంటున్నాం. ఇలాంటి సమయంలో కేసులు పెడుతూ కార్యాలయాల చుట్టూ తిప్పితే మా జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. పనుల్లేక ఆకలితో ఇబ్బందులు పెట్టడం సమంజసమేనా? అని వాపోయారు. సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ గిరిజనుల సాగులో ఉన్న భూములు వారి సాగులో ఉన్నాయో ?లేదో కనీసం పరిశీలించకుండా రెవెన్యూ అధికారులు ఎలా ఏపీఐఐసీకి విక్రయిస్తారని ప్రశ్నించారు. ఎక్కడో కొండల పక్కన పట్టాలు ఇచ్చి అక్కడికి వెళ్లాలంటే ఎలాగని వారి సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టి భయపెడుతూ వేధింపులకు గురి చేయడం తగదన్నారు.వారి సాగులో ఉన్న భూములు వారికే చెందుతాయని వారికున్న చట్టాలు వారికున్నాయని, ఆ చట్టాల ప్రకారం వారి భూములు సాధించుకునేందుకు పోరాటాలు చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

నమ్మించి మోసగించిన యువకుడిపై కేసు నమోదు

తెర్లాం: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై తెర్లాం ఎస్సై బి.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి మంగళవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన సిరిపురపు వెంకటరమణ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని కొన్నేళ్లుగా ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా అనుభవించి తీరా పెళ్లి చేసుకోమని కోరినప్పుడు నిరాకరించి వేరే యువతిని పెళ్లి చేసుకున్నానని చెప్పాడు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నమ్మించి మోసం చేసిన కేసు యువకుడిపై నమోదు చేశామని, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై సాగర్‌బాబు తెలిపారు.

అమరావతి పూర్తయ్యేదెప్పుడు..?

బొబ్బిలి: రాజధాని అమరావతిని పూర్తి చేసేసరికి ఎన్నాళ్లు పడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి,నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముమ్వల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు రాజధాని రూపు దిద్దుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం తుప్పలు, డొంకలు తొలగించిందే తప్ప ఇంకేమీ చేయలేదన్నారు.అసలింతకీ అమరావతిని పూర్తి చేసే ఉద్దేశం కూటమి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ

బొబ్బిలి: ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ముఖ్య అతిథిగా హాజరై ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాలు, విద్యార్థుల సమస్యలపై పోరాడడంలో ఏఐఎస్‌ఎఫ్ కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సుమన్, డివిజన్ కార్యదర్శి వి.శ్రావణ్‌కుమార్,కమిటీ సభ్యులు భరత్, కిరణ్,వాసు, ప్రదీప్, దిలీప్ పాల్గొన్నారు.

ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు

తెర్లాం: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి విద్యార్థులు, లైబ్రేరియన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుల్లో రంగనాథన్ ఒకరని, గ్రంథాలయాల ఏర్పాటు, అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలియజేసిన మహోన్నత వ్యక్తి రంగనాథన్ అని కొనియాడారు.

కూటమి నాయకులకే యూరియా..!



సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

సంతకవిటి: మండలంలోని మంతిన గ్రామ సచివాలయంలో మంగళవారం చేపట్టిన యూరియా పంపిణీ కార్యక్రమంపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రైతులందరికీ పారదర్శకంగా యూరియా పంపిణీ చేయాల్సిన అధికారులు, సిబ్బంది కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. యూరియా కోసం రైతులు సచివాలయం వద్ద పడిగాపులు కాచినప్పటికీ కొంతమందికే అది కూడా అరకొరగా పంపిణీ చేసి, మధ్యలో తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. దీంతో సిబ్బంది తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు ఒత్తిళ్ల మేరకే యూరియా పంపిణీ మధ్యలో నిలిపి వేశారని, మిగిలిన యూరియాను కూటమి నాయకులకు చేరవేసేందుకే అధికారులు ఇలా ప్రవర్తిస్తున్నారని రైతులు దుమ్మెత్తిపోశారు.